క్లుప్తంగా

రేపు తై బజార్ వేలం

తరిగొప్పుల: మండలకేంద్రంలో వార సంత (తై బజార్) నిర్వహణకు ఈ నెల 28వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి తై బజార్ నిర్వహణకు గురువారం ఉదయం 11 గంటలకు జీపీ ఆవరణలో బహిరంగ వేలం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



పాలకుర్తి టౌన్: రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నాం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంగళవారం మంత్రిని కలిసి అభివృద్ధిలో నియోజకవర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరారు.

నియామకం



రఘునాథపల్లి: మండలంలోని జాఫర్‌గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కర్నె అశోక్ స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ నియోజకవర్గ సేవాదళ్ ఇన్‌చార్జ్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మంగళవారం హైదరాబాద్‌లో అశోక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్‌లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని పేర్కొన్నారు. తన నియామకం కోసం సహకరించిన పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా రమేశ్



లింగాలఘణపురం: మండలంలోని పటేల్‌గూడేనికి చెందిన బండ రమేశ్‌ను కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు లొకుంట్ల ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, నియామక పత్రాన్ని మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర రమేశ్‌కు అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన బిట్ల ఉప్పలయ్యకు ఓబీసీ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహరించిన కాంగ్రెస్ నాయకులందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్‌చందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విజయ్‌మనోహర్, మహిళ మండల అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, జీడికల్ దేవస్థాన చైర్మన్ మూర్తి, నాయకులు బిట్ల బాబు, మోహన్, రాజు, అశోక్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయంపై హర్షం



కేయూ క్యాంపస్ : ఢిల్లీలోని జేఎన్‌యూలో విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి గెలుపొందడంతో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సంబురాలు నిర్వహించుకున్నారు. పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. మతోన్మాద సంఘాలు ఎన్ని కుట్రలు చేసినా ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయాన్ని ఆపలేక పోయారన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీలను తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానంపై కూడా వ్యతిరేకత పెల్లుబీకుతుందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ కేయూ అధ్యక్షుడు సాయికిరణ్, జనరల్ సెక్రటరీ స్టాలిన్, ఉపాధ్యక్షురాలు పరిమిళ, మంద వికాస్, అనూష, మంధు, హాథిరాం, జస్వంత్, మంగిలాల్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న



జఫర్‌గఢ్: అవగాహన సదస్సులో పాల్గొన్న బీఎల్‌ఓలు

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. ఎన్నికల విధుల నిర్వహణపై బీఎల్‌ఓలు, బీఎల్‌ఓల సూపర్‌వైజర్లు, సెక్టోరియల్ అధికారులకు డివిజన్‌కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడారు. ఎన్నికల విధుల్లో బీఎల్‌ఓలు అప్రమత్తంగా పని చేయాలని, ఓటరు జాబితాలో మొదటి పేజీలో పోలింగ్ కేంద్రం నంబర్, పోలింగ్‌కేంద్రం పేరు, లొకేషన్ ఇతరత్రా వివరాలు సరిగ్గా ఉన్నాయా అని పరిశీలన చేసుకోవాలన్నారు. డబుల్ ఓట్లు, మృతిచెందిన ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. 85 సంవత్సరాల వయస్సు దాటిన ఓటర్లు, అంగవైకల్యం ఉన్న ఓటర్లందరికీ 12 డీ ఫారాలు అందించాలని, తిరిగి వారి వద్ద నుంచి సేకరించి కార్యాలయంలో సమర్పించాలన్నారు. సదరు ఫారం ద్వారా వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. సెక్టోరియల్ అధికారులు అన్ని పోలింగ్‌కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై స్వయంగా పర్యవేక్షించి నివేదిక అందించాలన్నారు. అందరూ సమన్వయంగా పనిచేస్తూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్, సీడీపీఓ ఫ్లోరెన్స్, బీఎల్‌ఓలు, సూపర్‌వైజింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై బీఎల్‌ఓలకు అవగాహన

జఫర్‌గఢ్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హోం ఓటింగ్‌పై బీఎల్‌ఓలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్దకు రాని వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ సదస్సులో ఆర్‌ఐ అనిల్‌బాబుతో పాటు బీఎల్‌ఓల సూపర్ వైజర్లు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన అందిస్తున్న కాంగ్రెస్



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఇందిర, వైస్ ఎంపీపీ

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు ప్రజాసంక్షేమ పథకాలతో ప్రజారంజక పాలన సాగిస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన దాదాపు 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇందిర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని, దాంతో వివిధ రాజకీయ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తన ఆధ్వర్యంలో ఇందిర సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారని, రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరబోయిన శ్రీరాములు, కె.మహేందర్, బొందయ్య తదితరులు పాల్గొనగా మాజీ వార్డు సభ్యులు బర్మ రాజయ్య, యూత్‌నాయకుడు బలిజ రాజు, తాడూరి సునీల్, పాలకుర్తి నాగరాజు, దామెర శ్రీను, మోసిన్‌అలీ, బొల్లం నాగరాజు, రవి, అనీల్, షాహిద్, అమీర్, అరాఫత్, తిరుమలేశ్, రాజు, శివ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. మండలంలోని శివునిపల్లి మజీద్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఇందిర హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలకు పండ్లు, స్వీట్లు తినిపించిన ఆమె వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు



పుట్టలఎల్లమ్మ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దాతలు

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామానికి చెందిన దాతలు మాచర్ల సతీష్‌కుమార్–చందన, నారగోని గాయత్రి–రవిచంద్ర దంపతులు ఆలయం ఎదుట ఏర్పాటు చేయించిన పుట్టల ఎల్లమ్మ విగ్రహాలను అర్చకులు రవీందర్ శర్మ వేద మంత్రాల నడుమ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్‌గౌడ్, గనగోని వెంకటేశ్వర్లు, సట్ల లింగయ్య, చైర్మన్ మోడెం విజయభాస్కర్, గోడిశాల లావణ్య–నరేష్, నారగోని క్రాంతి, పంతం రాజు,మాచర్ల స్వామి, నారగోని పరమేష్, భీవండి వెంకన్న, గనగోని రమేష్, తెలిపారు. కుర్ర భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



బచ్చన్నపేట: కొన్నె గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల 6వ తరగతి విద్యార్థిని పి. అభినయ మండల స్థాయి కథల పోటీల్లో గెలుపొందంగా పలువురు మంగళవారం ఆమెను అభినందించి సర్టిఫికెట్‌ను అందజేశారు. అనంతరం హెచ్‌ఎం అంబదాస్ మాట్లాడుతూ అభినయ మండల స్థాయిలో నిర్వహించిన తెలుగు కథల పోటీల్లో మూడో స్థానంలో నిలిచి బహుమతిని గెలుపొందినదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

కొడకండ్ల: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గిర్నితండా వద్ద పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించి వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడు తూ ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో దేవరుప్పుల ఎస్సై చెన్నకేశవులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



కొడకండ్ల: రామన్నగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు రామన్నగూడెం గ్రామ శివారులోని పొలాల్లో పేకాట ఆడుతుండగా దాడి చేసి బొల్ల రమేష్, నారగాని సోమయ్య, వేము వీరస్వామి, కన్నెబోయిన రామ్మూర్తిలను పట్టుకొన్నామని, మరో ఐదుగురు తప్పించుకొని పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,750 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు, ఎనమిది బైక్‌లు స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు.

చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న భజరంగ్‌దళ్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సమీపాన ఉన్న తిరుమలనాథ స్వామి దేవస్థానానికి చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ గోనెల రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక తిరుమలనాథ స్వామి దేవస్థాన భూమిలో కొందరు రాత్రికి రాత్రే రేకులతో ఫెన్సింగ్ వేసిన విషయం తెలుసుకున్న భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు మంగళవారం సదరు స్థలంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దేవస్థాన భూమిని పరిరక్షించాలని నినాదాలు చేశారు. కాగా, భజరంగ్‌దళ్ నాయకుల ఫిర్యాదు మేరకు సదరు స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా రేకులతో ఫెన్సింగ్ చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్క రాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ పరిరక్షణ సమితి నాయకుడు ముక్క స్వామి, భజరంగ్ దళ్ జిల్లా కోకన్వీనర్ గుర్రపు అరవింద్, నీల అనీల్, సందీప్, రాకేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పాలకుర్తి: ప్రభుత్వం పేదల కోసం సేకరించిన భూమిని ఆక్రమిస్తున్నారని, ఆ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని లక్ష్మీనారాయణపురం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ వెంకటేశంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు గ్రామానికి చెందిన సర్వేనంబర్ 39,41లో 10 గుంటల భూమిని కొనుగోలు చేశారని తెలిపారు. ఇట్టి భూమిపై సర్వే నిర్వహించి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, తహసీల్దార్ స్పందించి సర్వే చేపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

హన్మంతు సేవలు మరువలేనివి



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కృష్ణమూర్తి

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం హన్మంతు సేవలు మరువలేనవని పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని ముస్‌పహాడ్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కదారి హన్మంతు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నాయకులు కడారి వీరమల్లయ్య, వెంకన్న, శేఖర్‌లను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కడారి వీరమల్లయ్య, వెంకన్న, శేఖర్, మండల సీనియర్ నాయకులు పారుపెల్లి శ్రీనివాస్,తోటకూరి రమేశ్, , గొడిశాల శ్రీను, చీకటి యాకయ్య, యాదయ్య, మండల యూత్ అధ్యక్షుడు ఉప్పుల అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక



అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు

బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, విద్యాశాఖ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నర్సింహస్వామి తెలిపారు. మంగళవారం కమిటీని ఎన్నుకున్న అనంతరం మాట్లాడుతూ చైర్ పర్సన్‌గా చల్ల కవిత, సభ్యులుగా నవనీత, కవిత, యమున, లావణ్య, అనిత, సుజాత, మాధవి, మణెమ్మ, భాగ్యలక్ష్మిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న నాయకులు



బచ్చన్నపేట: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన వేముల భాస్కర్ మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ.5వేల పంపించారు. బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, నాయకులు గుర్రపు రమేష్, బొమ్మ నర్సింహులు, కైసర్, సుభాష్, నాగరాజు ఉన్నారు.

గ్రామస్తుల ఆర్థికసాయం

భాస్కర్ కుటుంబ సభ్యులకు గోపాల్‌నగర్ వాసులు చందా జమచేసి రూ.18,100 లను అందజేశారు. నాగేష్, సత్యనారాయణ, రాందాస్, ఎల్లయ్య, జంపయ్య, కేశవులు తదితరులు ఉన్నారు.

కొన్నెలో..

మండలంలోని కొన్నె గ్రామ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న తులసి కృష్ణవేణి మృతి చెందింది. కాగా, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, కనుకయ్య, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్ కృష్ణ, బాధ్యులు గొట్టె కనుకయ్య, శ్రీధర్, యాదగిరి, లలిత, కవిత, సులోచన, శేఖర్, నిరంజని, శ్రీదేవి, లక్ష్మి, నర్సమ్మ ఉన్నారు.

మల్లంపల్లిలో..

పాలకుర్తి: పాలకుర్తి మండలం మల్లంపల్లిలో కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి తండ్రి పిచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, కుమారస్వామిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. నాయకులు పులి గణేష్, బాలరాజు. కోనె కార్తీక్, బత్తోజు రామస్వామి, పసులాది యాకస్వామి తదితరులు ఉన్నారు.

అన్నపై గొడ్డలితో దాడి

రఘునాథపల్లి: అన్నపై గొడ్డలితో దాడి చేసిన ఘటనలో తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుదిమెట్ల నరేష్ మంగళవారం తెలిపారు. జాఫర్‌గూడెం గ్రామానికి చెందిన కోడెల రాములు, కోడెల శ్రీను ఇరువురు అన్నదమ్ముల మధ్య కొన్నాళ్లుగా భూ వివాదం కొనసాగుతుంది. సోమవారం శ్రీను తన బర్రెలను రాములు చెలుకలో మేపుతున్నారు. తన భూమిలో ఎందుకు మేపుతున్నావని రాములు ఆగ్రహంతో గొడ్డలితో అన్నపై దాడి చేశాడు. దీంతో శ్రీను తలకు, చేతులకు గాయాలయ్యాయి. వెంట నే శ్రీనును జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తన తండ్రిపై ఆకారణంగా దాడి చేశాడని బాధితుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న దాతలు

పాలకుర్తి: మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన పసుల శ్యామల(26) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆమెకు భర్త రమేష్, జాన్విక, శివ ఇద్దరు పిల్లలున్నారు. కాగా, బమ్మెర గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పెంతల అశోక్ బాధిత కుటుంబానికి చేయూతనందించేందుకు ఫోన్‌పే ద్వారా విరాళాలు సేకరించాడు. ఫోన్‌పే ద్వారా వచ్చిన రూ.40,131 విరాళాన్ని మృతురాలి కూతురు జాన్విక పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో దార శంకరయ్య, దేవసాని నరేష్, మారం రవికుమార్, జోగు గోపి, చినూరు సోమయ్య,నర్సింహులు, బోయిని యాకయ్య, అనిల్, మేడిద ప్రశాంత్, ఉపేందర్, జన్ను సంపత్ తదితరులు ఉన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

జనగామ రూరల్: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు అయిన ఘటన మంగళవారం మండలంలోని పెద్దపహడ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపహడ్‌కు చెందిన గీత కార్మికుడు నామాల రవి రోజుమాదిరిగా తాటి చెట్టు ఎక్కి కల్లుగీసి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రవిని స్థానికులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బాధితుడిని గౌడ సంఘం నాయకుడు భిక్షపతి పరామర్శించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పొట్టకూటికి సర్కస్ ఫీట్లు



సర్కస్ చేస్తున్న మనోజ్ బృందం

దేవరుప్పుల: తెలుగు రాష్ట్రాలు వీడినా నేటికీ ఆ ప్రాంత వాసులు కులవృత్తిలో భాగంగా పొట్టకూటి కోసం సర్కస్ ఫీట్లు చేస్తూ మంగళవారం రాత్రి మండల కేంద్రంలో ప్రదర్శనలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలకు చెందిన మనోజ్ బృందం మొబైల్ వాహనంలో చేరుకొని మినీ సర్కస్‌ను తలపించేలా పలు విన్యాసాలు చేసి ప్రేక్షకుల్ని అబ్బురపర్చారు. ప్రధానంగా సైకిల్ బ్యాలెన్స్, మంటల చక్రాలు, పలు జానపద, సినీ గేయాలతో కూడిన నృత్యాలు చేస్తూ తమాషాతో కూడిన ఆటపాలతో అలరించారు.